సాక్షి
జగిత్యాల

ఆదివారం । 28 । జూలై । 2024

న్యూస్‌రీల్

గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



జగన్నాథపూర్ గ్రామాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

రాయికల్: గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. తీర ప్రాంతాలైన మండలంలోని నాయకపు గూడెం, బోర్నపల్లి, జగన్నాథపూర్ గ్రామాలను పరిశీలించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో నదిలో నీటిమట్టం పెరుగనుందని, మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని, గొర్రెల కాపరులు పశువులను నది పరిసరాల్లోకి వెళ్లవద్దని సూచించారు. బాధితులను రక్షించేందుకు పోలీస్‌శాఖ అన్నిరకాల చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై అశోక్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్ పాల్గొన్నారు.

జ్వర లక్షణాలుంటే రక్త పరీక్షలు చేసుకోవాలి



ఇంటి ఆవరణను పరిశీలిస్తున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

పెగడపల్లి: జ్వర లక్షణాలు ఉంటే తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకోవాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సూచించారు. పెగడపల్లిలో శనివారం నిర్వహించిన శానిటేషన్, డ్రైడేలో వైద్య సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. పలువురి ఇళ్లను సందర్శించి నీటి నిల్వను పారబోయించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. డెంగీ కేసులు నమోదైతే ఇళ్లవద్దకెళ్లి పరిసరాలను పరిశీలించి దోమల నివారణకు మందు స్ప్రే చేయించాలని సూచించారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, వైద్యాధికారి నరేశ్, ఎంపీవో మహేందర్, సీహెచ్‌వోలు మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు అనిల్‌జాదవ్, జయశీల, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, వైద్య సహాయకులు పాల్గొన్నారు.

గురుకులం.. ప్రాణభయం



పెద్దాపూర్ గురుకుల విద్యాలయం

- చుట్టూరా పొలాలు.. తోటలు
- విషపురుగుల సంచారం..
- పాఠశాల నిర్వహణపై నిర్లక్ష్యం
- విద్యార్థి మృతిపై అనుమానాలు
- మరో ఇద్దరికీ పాముకాటేనా..?
- మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తరలింపు



విద్యార్థిని పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో సమీయొద్దీన్

కోరుట్ల/మెట్‌పల్లిరూరల్: చుట్టూ పొలాలు, తోటలు. గదుల చుట్టూ పెద్ద పెద్ద చెట్లు, గడ్డి పొదలు..పాములు, తేళ్ల సంచారం ఇక్కడ సహజం. ఆ పరిసరాల్లోనే విద్యార్థులకు తరగతులు.. గదుల్లో ఊడిపోతున్న కిటికీలు..తలుపులు. అవే క్లాసులు..అక్కడే పడక. ఇదీ కోరుట్ల మండలం పెద్దాపూ ర్ గురుకుల విద్యాలయం దుస్థితి. శుక్రవారం జరి గిన సంఘటనతో ఉలిక్కిపడిన తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రాణభయంతో ఇక్కడ చదవడం ఇష్టం లేక మూకుమ్మడిగా ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు.

ప్రిన్సిపాల్ సస్పెన్షన్

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గణాదిత్య అస్వస్థతతో మృతి చెందడం.. రాపర్తి హర్షవర్ధన్, ఆడెపు గణేశ్ అస్వస్థతకు గురవడం.. బాధితులను ప్రిన్సిపాల్ ఆసుపత్రికి తరలించడంలో నిర్లక్ష్యం వహించడం.. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అరిచి గీపెట్టినా పట్టించుకోలే..

అడవిని తలపించే పరిసరాలు విద్యార్థులను బెదరగొడుతున్న క్రమంలో గురుకులం వసతి గృహం నిర్వహణపై నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గురువారం అర్ధరాత్రి 8వ తరగతి విద్యార్థి రాజారం గణాదిత్య (13) పరిస్థితి బాగా లేదని కేర్ టేకర్‌కు చెప్పేందుకు వర్షంలో విద్యార్థులు నానా తంటాలు పడ్డారు. అర్ధరాత్రి సమయంలో గణాదిత్య పడుతున్న అవస్థ చూడలేక అదే గదిలో పడుకున్న తోటి విద్యార్థులు ఒకటికి రెండు సార్లు కేర్‌టేకర్ గది వద్దకు వెళ్లి గట్టిగా అరిచి లేపినా ×తెల్లారి చూద్దాం లే× అని దాటేయడం విధులపై వారికున్న చిత్తశుద్ధికి అద్దం పడుతోంది. వేకువజామున గణాదిత్య పరిస్థితి విషమించిన క్రమంలో ఆరపేటలో ఉన్న తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వాళ్లు వచ్చేలోపు గణాదిత్య పరిస్థితి సీరియస్‌గా మారి మృతి చెందాడు. తమ బిడ్డ మృతికి కారణం ఫిట్స్ అని తల్లిదండ్రులు భావిస్తున్నా.. అదే గదిలో పడుకున్న మరో ఇద్దరు విద్యార్థులు ఆడెపు గణేష్ (13), రాపర్తి హర్షవర్ధన్(14) తమకు ఏదో పురుగు కుట్టినట్లు ఉందని శుక్రవారం ఉదయం ప్రిన్సిపాల్‌కు చెప్పారు. ఈ క్రమంలో గణాదిత్య మృతికి పాము కాటు కారణమా..? ఫిట్స్‌తోనే చనిపోయాడా..? అన్న విషయంలో అనుమానాలు నెలకొన్నాయి. పోస్టుమార్టం నివేదిక వచ్చేదాకా స్పష్టత వచ్చే అవకాశాలు లేవు. దీనికితోడు రెండు నెలలుగా గురుకులంలో ఉండాల్సిన వైద్య సిబ్బంది లేకపోవడం గమనార్హం. శనివారం ఉదయం పెద్దాపూర్ గురుకుల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ సత్యప్రసాద్ నిర్వహణలో నిర్లక్ష్యం చూపుతున్న ప్రిన్సిపాల్ విద్యాసాగర్‌తోపాటు ఉపాధ్యాయులపై మండిపడ్డారు.

చీమలు కుట్టాయంటారా..?

గణాదిత్య మృతి చెందిన తరువాత అదే గదిలో పడుకున్న 8 తరగతి విద్యార్థులు ఇబ్రహీంపట్నం ఫకీర్‌కొండాపూర్‌కు చెందిన గణేష్, మెట్‌పల్లికి చెందిన హర్షవర్ధన్ తమకు విషపురుగు కుట్టి ఉంటుందన్న అనుమానం వ్యక్తం చేస్తూ ప్రిన్సిపాల్‌కు విషయం చెప్పారు. దీనికి చీమలు కుట్టి ఉంటాయేమోనని చెప్పి మందులు వేసుకోమ్మని ప్రిన్సిపాల్ చెప్పడం ఎంత వరకు సమంజసమని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గణేశ్, హర్షవర్ధన్ తమకు విషపురుగు కుట్టిందన్న విషయాన్ని శుక్రవారం ఉదయమే చెప్పినా.. సాయంత్రం వరకు ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ ఎవరికీ చెప్పకపోవడం సందేహాలకు తావిస్తోంది. సాయంత్రం సమయంలో ఇద్దరికి కొంచెం నలతగా ఉండటంతో వారిని నిజామాబాద్ ఆసుపత్రికి పంపి చికిత్స అందించారు. ఒకవేళ పాముకాటు అయి తీవ్రత అధికంగా ఉంటే ఏ కాస్త ఆలస్యమైనా ప్రాణాలు పోయే దుస్థితి ఉండేది. ప్రమాదకర పరిస్థితులను గుర్తించి తక్షణమే స్పందించాల్సిన గురుకులం సిబ్బంది ధోరణి తల్లిదండ్రుల్లో ఆందోళనకు కారణమైంది. సుమారు 30 ఏళ్లుగా చదువులతో మేటిగా నిలిచిన పెద్దాపూర్ గురుకులంలో ఇప్పటికీ కొంతమంది విద్యార్థులు నేలపైనే పడుకునే దుస్థితి ఉండటం విచారకరం.

మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు..

పాముకాటుతోనే అస్వస్థతకు గురై ఉంటారని భావిస్తున్న గణేశ్, హర్షవర్ధన్ పరిస్థితిపై కలెక్టర్ ఆదేశాలతో శనివారం ఉదయం మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, వైద్యాధికారులు నిజామాబాద్ ఆస్పత్రికి వెళ్లి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారిద్దరినీ హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. విద్యార్థుల వెంట జిల్లా వైద్యాధికారి సమియొద్దీన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మెట్‌పల్లి మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి వెళ్లారు. వీరంతా అక్కడే ఉండి ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నారు. వారిద్దరి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉన్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల నేపథ్యంలో గురుకులంలో చదువుతున్న చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్తున్నారు.



విద్యార్థులు గణేష్, హర్షవర్ధన్‌ను అంబులెన్స్‌లో నిజామాబాద్ నుంచి నిమ్స్‌కు తరలిస్తున్న సిబ్బంది

పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి



పెద్దాపూర్ గురుకుల విద్యాలయానికి మంచిపేరు ఉంది. ఇక్కడ చదివిన చాలామంది పిల్లలు చక్కగా ఎదిగారు. ఈ మధ్య కాలంలో పాఠశాల పరిసరాల సరిగాలేక విద్యార్థులు విషపురుగులు, పాములు, తేళ్లతో పరేషాన్ అవుతున్నరు. గురుకుల నిర్వహణపై శ్రద్ధ పెట్టాల్సిన ఉద్యోగులు సరిగా పట్టించుకోవడం లేదు.

శేఖర్, విద్యార్థి తండ్రి, వేములకుర్తి

రైల్వేకూ అత్తెసరే!

- ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకుతగ్గిన ప్రాధాన్యం
- అన్నింటికి కలిపి రూ.382 కోట్లకుపైగా..
- తిరుపతి–కరీంనగర్ ట్రిప్పుల పెంపు, కొత్త రైళ్ల ఊసే లేదు
- కొత్తపల్లి–మనోహరాబాద్‌కు రూ.350 కోట్లు
- పెద్దపల్లి–ఖాజీపేట బైపాస్ లైన్‌కు కేవలం రూ.లక్ష
- ఊసేలేని హసన్‌పర్తి–కరీంనగర్ రైల్వే లైన్
- పింక్ బుక్ విడుదలలో జాప్యం ఎందుకో?



రామగుండం–మణుగూరుకు రూ.5 కోట్లే..

రామగుండం–మణుగూరు మధ్య ప్రస్తుతం ఉన్న 290 కి.మీలను 200 కి.మీలకు తగ్గించేందుకు భూపాల్లి మీదుగా ఈ లైన్ వేస్తున్నారు. 2022 డిసెంబరులో ఈ మార్గానికి ప్రధాని మోదీ రామగుండంలో శంకుస్థాపన చేశారు. కోల్‌కారిడార్‌గా పిలిచే ఈరైల్వే లైన్ పూర్తయితే.. 90.కి.మీల దూరం తగ్గడంతోపాటు, బొగ్గు తరలింపులో విప్లవాత్మక మార్పులు, సమ్మక్క–సారక్క, రామప్ప ఇతర ఆధ్యాత్మిక–పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. మొత్తం రూ.4000 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టుకు ఓటాన్ అకౌంట్‌లో రూ.5 కోట్లు కేటాయించగా ఇప్పుడు రూ.5 కోట్లే ఇచ్చారు. ఇలా అయితే ఈ ప్రాజెక్టు పూర్తికావడానికి ఎన్ని ఏళ్లు పడుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

సాక్షిప్రతినిధి, కరీంనగర్: రైల్వే బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ఈసారి పెద్దగా నిధులు రాలేదు. ఇటీవల కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పాత జిల్లా ప్రాజెక్టులకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కలేదు. ఫిబ్రవరిలో పెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను పోల్చి చూస్తే మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వేలైన్‌కు అదనంగా రూ.30 కోట్లు దక్కగా.. మణుగూరు–రామగుండం రైల్వేలైన్‌కు రూ.5 కోట్ల కోత పడింది. ఇక హసన్‌పర్తి–కరీంనగర్ రైల్వేలైన్ ప్రస్తావనే లేదు. ఇంకా కొన్ని పనులకు రూ.వెయ్యి, రూ.10,000, రూ.లక్ష కేటాయించడంపై జిల్లా వాసులు మండిపడుతున్నారు. ఇలాగైతే ప్రాజెక్టులు పూర్తవడానికి దశాబ్దాలు పడుతుందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మొత్తం మీద గత బడ్జెట్ తో పోల్చినపుడు సగం నిధుల కోతపడగా.. కొత్త రైళ్లు, సర్వీసుల పెంపు ప్రస్తావన లేకపోవడం గమనార్హం. ఓటాన్ అకౌంట్‌లో పాత జిల్లాకు రూ.673 కోట్లు కేటాయించగా ఈసారి రూ.382 అటూ ఇటూగా పరిమితమయ్యారు. తెలంగాణకు తక్కువ మొత్తంలో నిధులు కేటాయించారు కాబట్టే.. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని ఈసారి–పింక్ బుక్–విడుదలను దక్షిణమధ్య రైల్వే చేపట్టలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా పింక్ బుక్ ప్రతిని 'సాక్షి' ఎక్స్ క్లూజివ్‌గా సంపాదించింది.

కేటాయింపులు అంకెల్లో..

- కొత్తపల్లి– మనోహరాబాద్(148 కి.మీ) రైల్వేలైన్: రూ.350,00,00,000.00
- రామగుండం– బల్లార్షా విద్యుదీకరణ: రూ.25,00,00,000.00
- రామగుండం–మణుగూరు(200 కి.మీ) రైల్వేలైన్: రూ.5,00,00,000.00
- ఉప్పల్–జమ్మికుంట రైల్వే ఓవర్ బ్రిడ్జికి రూ.2,00,00,000.00
- మంచిర్యాల–పెద్దంపేట (4.37కి.మీ) డబ్లింగ్ : రూ.50,00,000.00
- పెద్దపల్లి బైపాస్(2.1కి.మీ) లైన్‌కు రూ. 1,00,000.00
- పెద్దపల్లి–కరీంనగర్–నిజామాబాద్ (177. కి.మీ) రైల్వేలైన్ లైన్ రూ.1000.00
- రాఘవాపురం–మందమర్రి (24.47 కి.మీ) డబ్లింగ్‌కు రూ.1000.00

కొత్తపల్లి–మనోహరాబాద్ కు రూ.350 కోట్లు

కరీంనగర్‌ను రాజధానితో కలిపే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఇది. మొన్నటి ఓటాన్ అకౌంట్ రూ.320 కోట్లు కేటాయించింది. ఇందులో రాష్ట్ర వాటాగా రూ.112 కోట్ల వరకు వెచ్చించాలి. ప్రస్తుతం మరో రూ.350 కోట్లు ఇవ్వనుంది. అంటే రూ.30 కోట్లు నిధులు పెరిగాయి. పాత కరీంనగర్‌కు ఎంతో ముఖ్యమైన ఈ ప్రాజెక్టును గత ప్రభుత్వం 2016లో కేంద్రాన్ని ఒప్పించి రూ.1,167 అంచనా వ్యయంతో ప్రారంభించింది. 148 కి.మీల పొడవైన ఈలైన్ ఇప్పటి వరకూ మనోహరాబాద్ నుంచి సిద్దిపేట (75 కి.మీ)వరకు పూర్తయింది. ప్రస్తుతం ఈలైన్ వర్క్స్ సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బాలమల్లు పల్లె గ్రామం వరకు వచ్చాయి. ట్రాక్ పనులు చకచకా నడుస్తున్నాయి.

నామమాత్రం కేటాయింపులు..

- పెద్దపల్లి–నిజామాబాద్ సెక్షన్‌ను ఖాజీపేట బల్లార్ష సెక్షన్‌తో కలిపే బైపాస్ లైన్‌కు కేవలం రూ. లక్ష కేటాయించారు. పెద్దపల్లి శివారులో నిర్మిస్తున్న 2.1 కి.మీల పొడవైన ఈలైన్ రెండు సెక్షన్లకు వారధి.
- పెద్దపల్లి–కరీంనగర్–నిజామాబాద్ రైల్వే లైన్ (177 కి.మీ) కొత్తలైన్ రూ.1000 కేటాయించడం విశేషం.
- రాఘవాపురం–మందమర్రి (24.47 కి.మీ) డబ్లింగ్‌కు కేవలం రూ.1000 ఇచ్చారు.
- మంచిర్యాల–పెద్దంపేట (4.37 కి.మీ) డబ్లింగ్‌కి రూ.50 లక్షలు కేటాయించారు.
- ఉప్పల్–జమ్మికుంట రైల్వే ఓవర్ బ్రిడ్జికి రూ.2 కోట్లు ప్రకటించారు.
- రామగుండం– బల్లార్షా విద్యుదీకరణ పనులకు రూ.25.99 కోట్లు

కొత్తరైళ్లు, సర్వీసుల పెంపు లేనట్లే?

- ఉమ్మడి జిల్లాకు ముఖ్యంగా కరీంనగర్ నుంచి ఎలాంటి కొత్త రైళ్లు ప్రకటించలేదు.12 ఏళ్ల క్రితం వచ్చిన రెండు రైళ్లు మినహా ఆ తర్వాత ఒక్క రైలూ రాలేదు.
- ప్రస్తుతం ఉమ్మడి జిల్లా నుంచి తిరుపతికి నడుస్తోన్న ఏకైక రైలు కరీంనగర్–తిరుపతి బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల పొడగింపు, రెగ్యులరైజేషన్ మీద ఎలాంటి ప్రకటన రాలేదు.
- తిరుపతి రైలుపై గతంలో దక్షిణమధ్యరైల్వే సమ్మతించినా.. ఈ బడ్జెట్‌లోనూ ఎలాంటి ప్రకటన లేకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు.
- హసన్‌పర్తి–కరీంనగర్ రైల్వే లైన్ కోసం ఇటీవల ఫైనల్ లొకేషన్ (ఎఫ్ఎల్ఎస్) సర్వే రూ.5 కోట్లతో పూర్తి చేశారు. నిజాంకాలం నాటి ఈ ప్రతిపాదన ఈసారైనా పట్టాలెక్కుతుందనుకుంటే.. బడ్జెట్‌లో ఈలైన్‌కు చోటు దక్కకపోవడంతో జిల్లా వాసులు తీవ్ర నిరాశలో ఉన్నారు.

పంచాయతీ నిధులకు గ్రహణం

- నిలిచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు
- 15వ ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ ఫండ్స్‌రాక ఇబ్బందులు
- బ్లీచింగ్ కొనలేని.. ట్రాక్టర్‌లో డీజిల్ పోయలేని దుస్థితి
- పెట్టుబడి పెట్టలేక అప్పులు చేస్తున్న అధికారులు



భీంరాజ్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

గొల్లపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రతినెలా గ్రామ పంచాయతీలకు నిధులు రావాలి. ఆ నిధులతోనే పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలుగానీ.. ఇతరత్రా పనులు చేసుకునే వీలుంటుంది. కానీ.. కొన్ని నెలలుగా నిధులు రాకపోవడంతో గ్రామాల్లో రోజువారీ పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సర్పంచులు, ఎంపీటీసీల పాలన ముగియడంతో పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించింది. ప్రభుత్వం. అయితే నిధుల విడుదల లేకపోవడంతో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు. ఇక పారిశుధ్య కార్మికులకు ఆర్నెళ్లుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత వంటి పనులు చేపట్టేందుకు జీపీల్లో నిధులు లేవు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి నెలా రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు ఆర్నెళ్లుగా రావడం లేదు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం నుంచే ఎస్ఎఫ్‌సీ నిధులు సుమారు 23 నెలలుగా నిలిచిపోయాయి. దీంతో పంచాయతీల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. వర్షకాలంలో బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు.. ఫాగింగ్ మిషన్ నిర్వాహణకు.. వీధి లైట్లు కొనుగోలుకు.. ప్రతినెలా కరెంట్ బిల్లు చెల్లించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.


పారిశుధ్య కార్మికుల బాధలు వర్ణనాతీతం

పల్లెల్లో పారిశుధ్య పనులు చేసే కార్మికులకు నాలుగు నుంచి ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదు. కొందరు కార్మికులు ఒక్కరోజు పంచాయతీ పనికి.. మరో రోజు కూలీ పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి వచ్చింది. ఇప్పటికే చాలా జీపీలలో పలువురు కార్మికులు పనులు మానేసి స్థానికంగా కూలీ పనులకు వెళ్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పనుల నిర్వహణకు ఇబ్బందులు...

జిల్లాలో 380 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మేజర్ పంచాయతీల్లో జనాభా ప్రకారం కొంత ఎక్కువ మొత్తంలో ఇంటి పన్నులు, వ్యాపార లైసెన్స్‌ల ద్వారా వచ్చే ఆదాయంతో కార్మికుల జీతాలు పోను మిగిలిన నిధులతో ఎలాగో నెట్టుకొస్తున్నారు. చిన్న గ్రామ పంచాయతీలలో తక్కువ మొత్తంలోనే ఆదాయం వస్తుండటంతో అవి కార్మికుల వేతనాలకూ చాలకపోవడంతో నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో జీపీల్లో సదుపాయాలు కల్పించడం కార్యదర్శులకు సవాల్‌గా మారింది. రోజువారీగా చెత్త సేకరణకు వినియోగించే ట్రాక్టర్‌లలో కనీసం డీజిల్ పోయలేని పరిస్థితి నెలకొంది. ఇక గ్రామాల్లో తాగునీటి సరఫరా, బోరుబావులు, చేతి పంపులు మరమ్మతుకు వస్తే బాగు చేయించేందుకు అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు కార్యదర్శులు వాపోతున్నారు.

ప్రతినెలా వేతనాలు చెల్లించాలి



పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బంది, ఉద్యోగులకు నెల నెలా వేతనాలు చెల్లించేలా ప్రత్యేక జీవో అమలు చేయాలి. చాలీచాలనీ జీతంతో పనిచేస్తున్న సిబ్బందికి నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారుతోంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు స్పందించి నిధులు విడుదల చేయాలి.

జంగిలి ఎల్లయ్య, జీపీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు

వెళ్లారుసరే.. వచ్చేవారేరి..?

- రాయికల్ ఆస్పత్రి వైద్యులు బదిలీ
- ప్రస్తుతం ముగ్గురు వైద్యులే దిక్కు
- రోగుల అందని వైద్యసేవలు
- ఫలించని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రయత్నం




రాయికల్ ఆస్పత్రి

రాయికల్(జగిత్యాల): రాయికల్ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రికి ఆర్థిక శాఖ నుంచి అనుమతి రాకపోవడంతో ఇటీవల జరిగిన బదిలీల జాబితాలో పేరు లేకుండా పోయింది. దీంతో వైద్యులు ఇక్కడి ఆస్పత్రిని ఎంచుకోలేకపోయారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి, వైద్యులు శశికాంత్‌రెడ్డి, రజిత ధర్మపురి ఆస్పత్రికి, డాక్టర్ రమేశ్ కోరుట్ల, శ్రీలత కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇక్కడ వాణి, తేజస్విని మాత్రమే రెగ్యులర్ వైద్యులు. ఉదయ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ఇక్కడినుంచి బదిలీ అయిన వైద్యులు అక్కడ రిపోర్ట్ చేశారు. కానీ.. ఇక్కడికి మాత్రం వారి స్థానంలో ఎవరూ రాలేదు. ఉన్న వైద్యులతోనే రోగులకు వైద్యసేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఫలించని ప్రయత్నం

ఆస్పత్రిని వెబ్ కౌన్సెలింగ్‌లో చేర్చాలని బదిలీలకు ముందే ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలని ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది. వెబ్ కౌన్సెలింగ్‌లో వైద్యులు రాకపోవడంతో జగిత్యాల ఏరియా ఆస్పత్రి నుంచి డిప్యూటేషన్ చేసే అవకాశం ఉంది.

వైద్యులను నియమిస్తాం



రాయికల్ ఆస్పత్రికి వైద్యుల నియామకం కోసం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి జిల్లా కేంద్రానికి బదిలీపై వచ్చిన వైద్యులను లేదా ఇతర వైద్యులను డిప్యూటేషన్‌పై పంపించి మెరుగైన వైద్యసేవలను కొనసాగిస్తాం. – సుదక్షిణదేవి, వైద్యవిధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్



సండే స్పెషల్

● **అమ్మానాన్న.. పిల్లలే మిన్న**

దొరికింది అమృతమైనా.. ఆహారమైనా.. బిడ్డల ఆకలి తీర్చేది అమ్మానాన్న మాత్రమే. అందుకే వాళ్లు కనిపించే దేవతలు. అర్ధాకలితో అలమటిస్తూ కూడా కన్న బిడ్డల బాగోగుల కోసం పరితపిస్తున్న తల్లిదండ్రులకు కొదవలేదు. కష్టాలకోర్చి, జీతాన్ని, జీవితాలను త్యాగం చేస్తూ పిల్లలను ప్రయోజకులను చేయాలని వాళ్లు పడుతున్న తపన ముందు ఏదీ ఎక్కువ కాదు. జన్మనిచ్చి, జీవితాన్ని పరిచయం చేసి, సమాజంలో గొప్ప వ్యక్తులుగా నిలబెట్టేందుకు కష్టపడుతున్న తల్లిదండ్రులందరూ పూజనీయులే. అమ్మానాన్న అంటే గాంభీర్యం, గౌరవం, భక్తి, భయం, ప్రేమ ఇవన్నీ ఒక్కప్పటి మాట. ఇప్పుడు వారు మంచి స్నేహితులు. చదువు, ఉద్యోగం, పెళ్లి వంటి విషయాలను ఎలాంటి అరమరికలు లేకుండా చర్చిస్తున్నారు. అమ్మ ప్రేమను పంచితే నాన్న భరోసా, భవిష్యత్తును అందిస్తాడు. అలాంటి వారిని మలి వయసులో వదిలేయకుండా, వృద్ధాశ్రమాలకు చేరకుండా చూడటం, ప్రేమను పంచడం ప్రతీ ఒక్కరి కర్తవ్యం కావాలి. నేడు పేరెంట్స్ డే సందర్భంగా అన్నింటా తామై, బిడ్డల భవిష్యత్తు కోసం కష్టపడి, వారిని ప్రయోజకులను చేసిన తల్లిదండ్రులపై ప్రత్యేక కథనం. – 10లో..

రైతులు రుణాలు తీసుకోవాలి



అల్లీపూర్ సహకార సంఘంలో అధికారులతో మాట్లాడుతున్న రఘువరణ్

రాయికల్: రుణమాఫీ అయిన రైతులు తిరిగి రుణం తీసుకోవాలని జిల్లా సహకార సంఘం అధికారి రఘువరణ్ కోరారు. శనివారం రాయికల్ మండలం అల్లీపూర్‌లోని సహకార సంఘ భవనాన్ని తనిఖీ చేశారు. రుణమాఫీ, స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. రైతులకు పీవోఎస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలన్నారు. విండో చైర్మన్ రాజలింగం, సీఈవో ఉపేందర్ ఉన్నారు.

జిల్లాలో 25.6 మి.మీ వర్షం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో శనివారం ఉదయం 8.30 గంటల వరకు సగటున 25.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో 36.4, మల్లాపూర్‌లో 35.5, రాయికల్‌లో 31.9, బీర్‌పూర్‌లో 11.8, సారంగాపూర్‌లో 21.1, ధర్మపురిలో 11.3, బుగ్గారంలో 15.8, జగిత్యాల రూరల్‌లో 28.1, జగిత్యాల అర్బన్‌లో 32.1, మేడిపల్లిలో 34.2, కోరుట్లలో 27.6, మెట్‌పల్లిలో 31.6, కథలాపూర్‌లో 29.1, కొడిమ్యాలలో 24.2, మల్యాలలో 25.1, పెగడపల్లిలో 25.9, గొల్లపల్లిలో 28.5, వెల్గటూర్‌లో 19.4, ఎండపల్లిలో 17.7, భీమారంలో 24 మిల్లీ మీటర్ల చొప్పున వర్షం కురిసింది. ఎస్సారెస్పీలోకి 35,078 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం 1074.1 అడుగులు, 31.035 టీఎంసీలకు చేరింది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి


రైతు శంకర్ (ఫైల్)

ధర్మపురి: పొలం పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొని రైతు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని గోవిందుపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోల శంకర్ (40) శనివారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా నేరెళ్ల జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో శంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఢీకొట్టిన ద్విచక్రవాహన దారుడు పరారీలో ఉన్నాడు. అతని కోసం సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. శంకర్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో 'కటారి' సోదరుడి మృతి


సత్యనారాయణ రావు (ఫైల్)

గొల్లపల్లి: గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్‌రావు సోదరుడు కటారి సత్యనారాయణరావు (57) గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చందోళి గ్రామానికి చెందిన సత్యనారాయణరావు గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆయన మృతిపై చంద్రశేఖర్ రావు తీవ్ర ద్రిగ్భ్రాంతికి గురయ్యారు. పలువురు రాజకీయ నాయకులు సంతాపం ప్రకటించారు.

బీఆర్ఎస్ హయాంలోనే రాయికల్ అభివృద్ధి


మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

రాయికల్: రాయికల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి చెందిందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సొంత ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరారని, అభివృద్ధి కోసం కాదని విమర్శించారు. శనివారం రాయికల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అప్పటి ఎంపీ కల్వకుంట్ల కవిత హయాంలో మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరయ్యాయని, బోర్నపల్లి బ్రిడ్జిని నిర్మించామని గుర్తుచేశారు. అభివృద్ధి కోసమే పార్టీ మారానని ప్రగల్భాలు పలుకుతున్న ఎమ్మెల్యే సంజయ్ రాయికల్ అభివృద్ధికి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, మ్యాకల కాంతారావు, మహేశ్‌గౌడ్, శ్రీరాముల సువర్ణ, సాయికుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్, మహిళా అధ్యక్షురాలు స్పందన పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని నిలదీస్తాం

మల్లాపూర్: ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీల అమలు చేయడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరిబాబు అన్నారు. పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. రైతు భరోసా అందడంలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మీ, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బైన ప్రశాంత్, మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు పాల్గొన్నారు.

అమ్మానాన్న.. పిల్లలే మిన్న

- కని'పెంచే' దేవతలు
- బిడ్డలను ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్న తపన
- కష్టాలకోర్చి, జీతం, జీవితం త్యాగం
- ప్రయోజకులను చేసి, మురిసిపోతున్న తల్లిదండ్రులు
- నేడు పేరెంట్స్ డే

సండే స్పెషల్

అమ్మానాన్న.. పిల్లల భవిష్యత్తు కోసం కష్టాలకోర్చి, జీతాన్ని, జీవితాన్ని త్యాగం చేస్తారు. తాము ఎలా బతికినా బిడ్డలు మాత్రం ఉన్నత స్థాయిలో ఉంటే చాలన్న తపన. అందుకోసం అహోరాత్రులు శ్రమిస్తారు. ఆ శ్రమను గుర్తిస్తున్న పలువురి కుమారులు, కూతుళ్లు ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. తల్లిదండ్రులకు పేరు తీసుకువచ్చి, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చిన తల్లిదండ్రులపై ఈ వారం సండే స్పెషల్.

పల్లె నుంచి విదేశాలకు..


తల్లిదండ్రులతో వంశీ, గ్రీష్మ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నారాయణపూర్‌కు చెందిన లద్దునూరి తిరుపతి–రేణుక దంపతులకు ఇద్దరు సంతానం. కొడుకు వంశీ ఎండీ పీడియాట్రిషన్ పూర్తి చేసి, లండన్ వెళ్లగా, కూతురు గ్రీష్మ ఇంజినీరింగ్ పూర్తి చేసి, అమెరికాకు చెందిన ఎంఎన్‌సీ కంపెనీలో పని చేస్తోంది. వంశీ దావోస్‌లో వైద్య విద్యనభ్యసించేందుకు తండ్రి తిరుపతి తనకున్న వ్యవసాయ భూములను అమ్మేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా కొడుకు, కూతురును ఉన్నతంగా చూడాలన్న సంకల్పంతో ముందుకెళ్లి, సక్సెస్ అయ్యారు. పిల్లలిద్దరూ ఉన్నత స్థానాల్లో స్థిరపడటంతో ఆ దంపతులు మొదటినుంచి పడిన కష్టాలను మరిచిపోయారు. వారి సంతోషానికి అవధుల్లేవు.

ప్రైవేట్ టీచర్.. పిల్లలు ఐఐటీ


అమ్మానాన్నతో సాయిప్రీతమ్, ఆదర్శ్‌సాయి

సిరిసిల్ల కల్చరల్: వెంకంపేటకు చెందిన ఆడెపు శ్రీనివాస్–సుజాత దంపతులకు ఇద్దరు అబ్బాయిలు సాయిప్రీతమ్, ఆదర్శ్ సాయి ఉన్నాయి. ప్రైవేట్ టీచర్‌గా జీవితాన్ని ప్రారంభించిన శ్రీనివాస్ తన పిల్ల లకు మంచి చదువే నిజమైన ఆస్తిగా భావించారు. కుటుంబంతో సహా హైదరాబాద్ వెళ్లారు. అక్కడ ప్రైవేట్ స్కూళ్లలో పని చేస్తూనే కుమారులను ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కొడుకు సాయిప్రీతమ్‌ను ఖరగ్‌పూర్‌లో ఐఐటీ పూర్తి చేశాడు. ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగ సాధనకు ప్రయత్నాలు చేస్తున్నాడు. చిన్న కొడుకు హైదరాబాద్ ఐఐటీలో ఫైనలియర్ చదువుతున్నాడు. రెండు దశాబ్దాల తమ కష్టం ఫలించిందని ఆ తల్లిదండ్రులు సంతోషిస్తున్నారు.

డ్రైవర్ కుమారుడు, కూతురు..


పిల్లలతో సత్యనారాయణ-పద్మ

రామగిరి(మంథని): మండలంలోని కల్వచర్లకు చెందిన పొత్తెం సత్యనారాయణ–పద్మ దంపతులకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. సత్యనారాయణ ఓ ప్రైవేట్ కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పద్మ ఇంటివద్దే కుట్టు మెషిన్ నిర్వహిస్తోంది. పిలలను ఉన్నత స్థాయిలో ఉంచాలని తపన పడ్డారు. వారిని అర్థం చేసుకున్న కుమారుడు, కూతురు ఉన్నత చదువులు చదివారు. రాము ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్నాడు. రమ్య ఆదాయ పన్ను శాఖలో ట్యాక్స్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. అమ్మానాన్న ప్రోత్సాహంతోనే తాము ఈ స్థితిలో ఉన్నామని వారు తెలిపారు.

నేత కుటుంబం నుంచి లెక్చరర్‌గా..


తల్లిదండ్రులతో మార్కండేయ

మానకొండూర్: మండలంలోని చెంజర్లకు చెందిన బైరి ఎల్లయ్య–కమల దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వీరిది చేనేత కుటుంబం. ఎల్లయ్య ఏడోతరగతి వరకే చదువుకున్నాడు. నిత్యం మగ్గం వర్క్ చేస్తూ.. నేసిన బట్టలను సైకిల్‌పై పెట్టుకొని ఊరూరా తిరిగి విక్రయించేవారు. తాను పడిన కష్టం పిల్ల లు పడొద్దని వారిని ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కుమారుడు తిరుపతి ఓ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా, కూతురు స్వరూప ఓ కళాశాలలో ట్యూటర్‌గా పని చేస్తున్నారు. చిన్న కుమారుడు మార్కండేయ 2006లో ఎస్జీటీ, 2012లో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 2012లో గ్రూప్–2 ఉద్యోగం వచ్చినా చేరలేదు. ప్రస్తుతం వెల్గటూర్ హైస్కూల్లో ఇంగ్లిష్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఇటీవల జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు.

ముగ్గురు కుమారులూ ఉద్యోగులే..


కుమారులతో మల్లమ్మ-వెంకటనర్సయ్య

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని తడగొండకు చెందిన ఎడపెల్లి మల్లమ్మ–వెంకటనర్సయ్య దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కొడుకు శ్రీనివాస్ ఆర్టీసీ కండక్టర్‌గా, రెండో కుమారుడు రమేశ్ జిల్లా కేంద్రంలో పోలీస్‌గా, మూడో కుమారుడు చంద్రశేఖర్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వెంకటనర్సయ్య ప్రభుత్వ పాఠశాలలో అటెండర్‌గా పని చేస్తూ పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. తమ కష్టానికి ఫలితంగా ముగ్గురు కుమారులూ ప్రయోజకులయ్యారని ఆ దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ ఎదుగుదల వెనక అమ్మానాన్న ప్రోత్సాహం ఎంతో ఉందని అన్నదమ్ములు తెలిపారు.

ముగ్గురి చదువులు ఉస్మానియాలో..


పిల్లలతో శ్రీనివాస్-మానస దంపతులు

జమ్మికుంట(హుజూరాబాద్): పెద్దపెల్లి జిల్లా పొత్కపెల్లి మండలంలోని శానగొండకు దూడం శ్రీనివాస్–మానస దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వీరు బతుకుదెరువు కోసం జమ్మికుంటకు వచ్చారు. శ్రీనివాస్ పట్టణంలోని ఓ ప్రైవేట్ కంపనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. కూతురు రమ్య ఉస్మానియాలో బీఎస్సీ నర్సింగ్ చేసి, ప్రస్తుతం కరీంనగర్ మెడికల్ కళాశాలలో నర్సింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించింది. పెద్ద కుమారుడు రాహుల్ ఉస్మానియాలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, పీజీ కోసం ప్రయత్నం చేస్తున్నాడు. చిన్న కుమారుడు రామకృష్ణ సైతం ఉస్మానియాలోనే ఎంబీబీఎస్ ఫైనలియర్ చదువుతున్నాడు. పిల్లలు అత్యంత ప్రతిభతో ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీట్లు సాధించి, ప్రయోజకులవడంతో తల్లిదండ్రులు గర్వపడుతున్నారు.

వ్యాపారంలో ఒడిదొడుకులొచ్చినా..


తల్లిదండ్రులతో వంశీ, వైష్ణవి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన బుస్స గంగాధర్–కవిత దంపతులకు కొడుకు వంశీ, కూతురు వైష్ణవి ఉన్నారు. వీరిది వ్యాపార కుటుంబం. వ్యాపారంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదురయ్యాయి. అన్నింటినీ తట్టుకొని పిల్లలిద్దరినీ కమ్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చదివించారు. ప్రస్తుతం వంశీ అమెరికాలో ఉద్యోగం చేస్తుండగా, వైష్ణవి క్యాబ్ జెమినీలో పని చేస్తోంది. పిల్లలు ఉన్నత స్థాయిలో ఉండటం చూసి, ఆనందపడుతున్నారు.

వ్యవసాయ కుటుంబం నుంచి..


ఐఐటీ పట్టా, అమ్మానాన్నతో అఖిల్ (ఫైల్)

వీర్నపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన గుగులోత్ తిరుపతి–కౌసల్య దంపతులకు ఇద్దరు కుమారులు అరవింద్, అఖిల్ ఉన్నారు. వీరిది వ్యవసాయాధారిత కుటుంబం. పిల్లలను కష్టపడి చదివించారు. పెద్ద కొడుకు బద్దనపల్లి పోస్టాఫీస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు అఖిల్ మద్రాస్ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాడు. ప్రస్తుతం ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ.19 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ గిరిపుత్రులిద్దరూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

రైతుబిడ్డ ఎస్సై..


అమ్మానాన్నతో మహేశ్

మల్యాల(చొప్పదండి): మండలంలోని లంబాడిపల్లికి చెందిన గంగుల సారమ్మ–మల్లయ్య దంపతుల ఒక్కగానొక్క కుమారుడు మహేశ్. వీరిది వ్యవసాయ కుటుంబం. రెండెకరాల్లో తల్లిదండ్రులు వరి సాగు చేస్తుంటే మహేశ్ కూడా వారి సాయపడుతూ 4 కిలోమీటర్ల దూరంలోని తాటిపల్లి హైస్కూల్‌కు వెళ్లి చదువుకున్నాడు. పదిమందికి సాయం చేసే స్థాయిలో ఉండాలన్న అమ్మానాన్న మాటలతో పదోతరగతిలో 555/600 మార్కులు సాధించి, బాసర ట్రిపుల్‌ఐటీలో సీటు పొందాడు. కోర్సు పూర్తయ్యాక సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చినా పోటీ పరీక్షల వైపు మొగ్గుచూపాడు. పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం వచ్చినప్పటికీ ఎస్సై పోస్టు కోసం ప్రిపేరయ్యాడు. మొదటి ప్రయత్నంలోనే సివిల్ ఎస్సైగా ఉద్యోగం సాధించాడు.

కొత్తగట్టు నుంచి ఐఏఎస్..

శంకరపట్నం(మానకొండూర్): కొత్తగట్టు గ్రామానికి చెందిన కోరెం శ్రీనివాస్‌రెడ్డి–ప్రమీల దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కొడుకు వాసుదేవరెడ్డి టీచర్, రెండో కుమారుడు మల్లారెడ్డి వ్యవసాయం, చిన్న కుమారుడు అశోక్‌రెడ్డి ఐఏఎస్ ఆఫీసర్. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూనే పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. అమ్మానాన్నతోపాటు సోదరుడు వాసుదేవరెడ్డి ప్రోత్సాహంతో అశోక్‌రెడ్డి ఐఏఎస్ సాధించారు. గతంలో ఐఅండ్‌పీఆర్ స్పెషల్ కమిషనర్‌గా పని చేశారు. ప్రస్తుతం హార్టికల్చర్ కమిషనర్‌గా హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఇద్దరు సోదరులు మరణించారు. తన భవిష్యత్తును ఉన్నతంగా తీర్చినందుకు తల్లిదండ్రులను అశోక్‌రెడ్డి కంటికిరెప్పలా చూసుకుంటున్నారు.


- తండ్రితో ఐఏఎస్ అధికారి అశోక్‌రెడ్డి

మత్తు చల్లి మాయ చేసి..


బాధితుడు ప్రసాద్

- జువెల్లరీ షాపులో సినీఫక్కీలో చోరీ
- ఐదు తులాల బంగారం
- రూ.25వేలు అపహరణ

రాయికల్: రాయికల్‌లోని శ్రీలక్ష్మీ నరసింహాజువెల్లరీషాపులో శనివారం రాత్రి సినీఫక్కీలో చోరీ జరిగింది. యజమానిపై మత్తు చల్లి రూ.25వేలు ఐదు తులాల బంగారాన్ని దొంగలించారు. బాధితుడి కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులు దుకాణానికి వచ్చి భూమిపూజ ఉందని, గురిగే బంగారం కావాలని యజమాని ఉరుమల్ల ప్రసాద్‌ను కోరారు. వారి వెంట తెచ్చుకున్న కాయిన్‌ను ఇచ్చారు. దానిని చేతుల్లోకి తీసుకున్న వెంటనే ప్రసాద్ స్పృహ తప్పిపోయాడు. వెంటనే అగంతకులు దుకాణంలో ఉన్న రూ.25వేలు, ఐదు తులాల బంగారాన్ని అపహరించారు. 15 నిమిషాలకు స్పృహలోకి వచ్చిన ప్రసాద్ లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు.

పాఠశాల తనిఖీ


హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గౌతంరెడ్డి

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి శనివారం తనిఖీ చేశారు. మూత్రశాలలు అపరిశుభ్రంగా ఉండడం, పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో హెచ్‌ఎం రాజన్నపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట గదిని పరిశీలించి శుభ్రంగా లేకపోవడంతో మందలించారు. స్టోర్ రూంలో బ్లూబోర్డు ఉండడంపై హెచ్‌ఎంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు ఉన్నా.. లేవని మీడియాకు ఎందుకు చెబుతున్నారని ప్రశ్నించారు. మన ఊరు మన బడి కింద పెట్టిన పనుల తీర్మాన కాపీ చూపాలని కోరగా.. హెచ్‌ఎం సమాధానం ఇవ్వలేదు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టిక సరిగ్గా లేకపోవడంపై మందలించారు. పాఠశాల ఆవరణలోని చెత్తాచెదారాన్ని తొలగించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, ఎంపీవో చంద్రశేఖర్ ఉన్నారు.

నృసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారలను దర్శించుకున్నారు. ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించారు.

'రిసెప్షన్ డెస్క్'లు ప్రారంభం

జగిత్యాలఅగ్రికల్చర్: విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు జిల్లా, డివిజన్, మండలాల వారీగా రిసెప్షన్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు ఎన్పీడీసీఎల్(వరంగల్) చీఫ్ ఇంజినీర్ తిరుమల్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం విద్యుత్ వినియోగదారుల రిసెప్షన్ డెస్క్‌ను ప్రారంభించారు. విద్యుత్ సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామని, ఎక్కడ ఫిర్యాదు చేసినా రశీదు పొందాలని సూచించారు. సమస్య పరిష్కారం కాకుంటే మరోసారి ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ సత్యనారాయణ, టెక్నికల్ ఏడీ నగేష్‌కుమార్ పాల్గొన్నారు.

సౌదీలో బీర్‌పూర్ యువకుడు అదృశ్యం..?

- ఏడు నెలలుగా సమాచారం లేని వైనం
- ఆచూకీ కోసం భార్యాపిల్లల ఎదురుచూపు


వేడుకుంటున్న తల్లి, తండ్రి, భార్య, పిల్లలు

సారంగాపూర్: ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిన ఓ యువకుడు ఏడు నెలలుగా ఏమయ్యాడో తెలియడం లేదు. దీంతో ఆ కుటుంబంలో ఆందోళన నెలకొంది. బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కందుల తిరుపతి (35) సౌదీ వెళ్తున్నాడు. అక్కడి జిద్దాలోని గ్రీన్‌రెడ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం ఇంటికొచ్చి వెళ్లిన ఆయన నుంచి ఏడు నెలలుగా ఫోన్ రావడం లేదు. 2023 డిసెంబర్ 7న భార్య అనూషకు ఫోన్‌చేసి ఇంటికి వస్తున్నట్లు చెప్పాడు. అప్పటి నుంచి ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. అక్కడ ఏమైందోనని తిరుపతి భార్య, పిల్లలు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరుపతితో గదిలో ఉన్న స్నేహితులను అడిగితే అనారోగ్యం బారిన పడడంతో ఆస్పత్రిలో చేర్పించామని, ప్రస్తుతం ఎటు వెళ్లాడో తెలియదని అంటున్నారు. సౌదీలో ఉంటున్న బంధువు సతీశ్‌కు సమాచారం ఇచ్చినా తిరుపతి ఆచూకీ లభించలేదు. తిరుపతి ఆచూకీ కనుగొని, స్వదేశానికి పంపించాలని అనూష, తిరుపతి తల్లిదండ్రులు పుష్పలత, సత్తెన్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిశారు. వారు ఇండియన్ ఎంబస్సీకి సమాచారం ఇచ్చారని తెల్సింది.


తిరుపతి (ఫైల్)

ట్రినిటీ కళాశాలలో బోనాల జాతర



బోనాలతో విద్యార్థినులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని ట్రినిటీ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆషాఢంలో బోనం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ నీతారెడ్డి, లెక్చరర్లు సరిత, గీత, రజిత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నలుగురికి జైలు

కరీంనగర్‌క్రైం: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నలుగురికి కరీంనగర్ కోర్టు జైలుశిక్ష విధించింది. ట్రాఫిక్ సీఐ కరీముల్లాఖాన్ ప్రకారం.. నగరంలో మద్యం సేవించి, వాహనాలు నడుపుతూ పట్టుబడిన 55 మందిని ట్రాఫిక్ పోలీసులు శనివారం కోర్టులో ప్రవేశపెట్టారు. వీరిలో నలుగురికి 3 రోజుల జైలు, రూ.8,500 జరిమానా, మిగతా వారికి రూ.80,500 జరిమానా విధించారని సీఐ పేర్కొన్నారు.

విద్యార్థుల అస్వస్థతపై సమగ్ర విచారణ

- కలెక్టర్ సత్యప్రసాద్


విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులం విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై సమగ్ర విచారణ చేపడుతున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ స్పష్టం చేశారు. వసతి గృహాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అస్వస్థత బారిన పడడానికి కారణాలను విద్యార్థులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గదుల్లో కిటికీలకు తలుపులు లేకపోవడం, పారిశుధ్యం పేరుకుపోవడం, మరుగుదొడ్లు సరిగ్గా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం ఉందన్న ఆరోపణలపై విచారణ కొనసాగుతోందని, నిజమని తేలితే చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌చార్జి ఏంఈవో భీమయ్య పాల్గొన్నారు.

ఘటన బాధాకరం..

విద్యార్థులు అస్వస్థతకు గురికావడం బాధాకరమని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పాఠశాలను సందర్శించిన ఆయన ఘటనకు గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నూతన భవనం పనులు పూర్తికాలేవని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, కోరుట్ల ఎస్సై కిరణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ లింగారెడ్డి ఉన్నారు.

సమస్యలుంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలి

పాఠశాలలో సమస్యలుంటే ఎమ్మెల్యే సంజయ్ దృష్టికి తీసుకురావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థుల అస్వస్థతపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని విద్యార్థులకు సూచించారు. నాయకులు సాయిరెడ్డి, రాజేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

రూ.6 లక్షల విలువైన మద్యం ధ్వంసం


రోడ్డు రోలర్‌తో మద్యాన్ని ధ్వంసం చేయిస్తున్న అధికారులు

ధర్మపురి: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్న పోలీసులు.. పట్టణంలోని హెలిప్యాడ్ సమీపంలో శనివారం రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. డీఎస్పీ రఘుచందర్ మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ధర్మపురి, వెల్గటూర్, గొల్లపెల్లి పోలీస్‌స్టేషన్ల పరిధి నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నారు. మొత్తం 108 కేసుల్లో 2019.57 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని సుమారు 6 లక్షలు. మద్యం సీసాలను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశామని తెలిపారు. సీఐ రాంనర్సింహారెడ్డి, ఎక్సైజ్ సీఐ మహేంద్రసింగ్, ఎస్సైలు ఉదయ్‌కుమార్, సతీశ్, ఉమాసాగర్ ఉన్నారు.

అధికారులకు అభినందనలు

- బాలికలపై అత్యాచార కేసుల్లో శిక్ష పడేలా కృషి.
- ఉమెన్ సేఫ్టీవింగ్ అడిషనల్ డీజీ షికాగోయల్ నుంచి ప్రశంస


అధికారులను అభినందిస్తున్న రాష్ట్ర ఉమెన్‌సేఫ్టీ వింగ్ అడిషనల్ డీజీ షికాగోయల్

గొల్లపల్లి: మండలంలోని దట్నూరు గ్రామానికి చెందిన బాలికలపై అత్యాచారం చేసిన కొడిమ్యాల హరికృష్ణ అలియాస్ హరీశ్‌కు మూడు కేసుల్లో ఒక్కో కేసులో 20ఏళ్ల జైలు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను శనివారం రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డీజీ షికాగోయల్ అభినందించారు. హరికృష్ణ కిరాణ షాపు నిర్వహిస్తుంటాడు. నిత్యావసర సరుకుల కోసం దుకాణానికి ఒంటరిగా వచ్చే బాలికలను టార్గెట్‌గా చేసుకుని ట్రాప్ చేయడం ప్రవృత్తిగా మార్చుకున్నాడు. మాయమాటలు చెప్పి సెల్‌ఫోన్‌లో ఆటలు ఆడుకునేలా చేస్తూ అశ్లీల వీడియోలు చూపించేవాడు. అలా ముగ్గురు బాలికలపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అతడి వికృత చేష్టలు గమనించిన ఓ వ్యక్తి జరిగిన విషయాన్ని బాలికల తల్లిండ్రులకు తెలపడంతో వారు 2022 ఏప్రిల్ 7న గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్సై శ్రీధర్ రెడ్డి, జగిత్యాల డీఎస్పీ ప్రకాశ్, సీఐ కోటేశ్వర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాల త్రిపురసుందరి కేసు వాదించారు. సరైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో జిల్లా న్యాయమూర్తి నీలిమ నిందితుడికి ఒక్కో కేసులో 20 ఏళ్ల చొప్పున శిక్ష విధించారు. ఒక్కో కేసులో రూ.5వేల చొప్పున జరిమాన విధించారు. ఆ కేసుల్లో శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి జగిత్యాల డీఎస్పీ ప్రకాశ్, సీఐ కోటేశ్వర్, ఎస్సై శ్రీధర్‌రెడ్డి, పీపీ బాల త్రిపురసుందరి, భరోసా సెంటర్ లీగల్ ఆఫీసర్ తేజ, కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్‌ను షికాగోయల్ హైదరాబాద్‌లో అభినందించి ప్రశంసపత్రాలు అందించారు. వారిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.